ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. శనివారం సమీకృత పాలనా ప్రాంగణంలో ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. అసంపూర్తి పనులపై దృష్టి సారించాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల మరమ్మతులో వేగం పెంచాలన్నారు.

ఈనాడు
పెద్దపల్లి
ఆదివారం సెప్టెంబరు 29, 2024

ప్రణాళికతో చదివితే.. పదిలో విజయం

విద్యార్థులకు విషయ నిపుణుల సలహాలు

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ జీపీఏను సాధించాలనే లక్ష్యంతో ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ప్రత్యేక తరగతులు, ట్యూషన్లు, హోంవర్క్‌లు వంటి వాటితో పుస్తకాల పురుగుల్లా మారుతున్నారు. అయితే కొందరికి పాఠ్యాంశాలపై సరైన ప్రణాళిక, పరీక్షలపై అవగాహన కొరవడటం వంటి వాటితో ఆందోళన చెందుతున్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో శ్రమిస్తూ కొంత ఒత్తిడికి గురవుతున్నారు. ఈ పరీక్షలకు దాదాపు 6 నెలల సమయం ఉంది. ఈ క్రమంలో గణితం, సైన్స్ పరీక్షలకు సంబంధించి దృష్టి సారించాల్సిన అంశాలపై విషయ నిపుణులు 'న్యూస్‌టుడే'కు వివరించారు.


కరీంనగర్ సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

సంసిద్ధతతో గణితంలో మంచి మార్కులు

- గణితంలో ఉత్తమ జీపీఏ కోసం విద్యార్థులు ఇప్పటి నుంచే నిత్యం గంటకుపైగా సమయాన్ని వెచ్చించాలి.
- ప్రతి అధ్యాయంలోని కీలక భావనలు, సూత్రాలను రోజూ పునశ్చరణ చేయాలి. ముఖ్య సూత్రాలను ఛార్ట్ రూపంలో తయారుచేసి ఇంట్లో అంటించుకోవాలి.
- గత ప్రశ్నపత్రాల్లోని ప్రశ్నలు తిరిగి పునరావృతం కానప్పటికీ.. వాటి మాదిరిగా ఉన్న ప్రశ్నలను ఎక్కువగా సాధన చేయాలి. ఎస్‌ఈఆర్టీ వారి గణిత అభ్యాస దీపికల నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చే అవకాశమున్నందున వాటిపై దృష్టి పెట్టాలి. 10జీపీఏ సాధన కోసం అన్ని అధ్యాయాలపై పట్టు సాధించాలి.
- వ్యాసరూప ప్రశ్నలకు ఎక్కువ మార్కులు ఉన్నందున వాస్తవ సంఖ్యలు, బహుపదులు, నిరూపక రేఖాగణితం, సరూప త్రిభుజాలు, త్రికోణమితి, సాంఖ్యాక శాస్త్రం, సంభావ్యత ఆధ్యాయాలపై పట్టు సాధించాలి.
- సమితులు, సాంఖ్యాక శాస్త్రం, సంభావ్యత ఆధ్యాయాల అంశాలను అభ్యాసం చేయడం ద్వారా సులభంగా ఉత్తీర్ణులు కావచ్చు.
- వెన్ చిత్రాలు, వర్గ బహుపది, వృత్తమునకు స్పర్శ రేఖలను గీయడం, సరూప త్రిభుజాల నిర్మాణాలు, ఓజీవ్ వక్రములను నిర్మించడాన్ని పలుమార్లు సాధన చేస్తే మంచి మార్కులు సాధ్యం.
- సమితులలో సమ్మేళనం, ఛేదనం, పూరకము, భేదం లాంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. పరీక్షల సన్నద్ధత కోసం వీలైనన్ని నమూనా ప్రశ్నపత్రాలను ప్రాక్టీసు చేయడం అలవాటు చేసుకోవాలి.
- పార్ట్-బి(ఆబ్జెక్టివ్) పేపర్‌లోని సమస్యలకు ప్రతి అధ్యాయం నుంచి కీలక అంశాలు, సూత్రాలు ప్రాక్టీసు చేయాలి. పాఠ్యపుస్తకంలోని అన్ని బిట్లు ప్రాక్టీసు చేయడం మరొవద్దు.


- మనోహర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, రిసోర్స్ పర్సన్, జడ్పీ ఉన్నత పాఠశాల, గోరింటాల

విభజించి చదివితే భౌతికశాస్త్రం సులభం..

- పరీక్షలకు దాదాపు 6 నెలల సమయం ఉండటంతో.. భౌతిక శాస్త్రంలోని 12 అధ్యాయాలను విభజించుకుని చదివితే ఉత్తమ గ్రేడ్ సాధ్యం. విభజించుకునేటప్పుడు దగ్గరి సంబంధం గల పాఠాలను ఎంచుకోవాలి. ఉదాహరణకు మొదటి, 3వ పాఠంలోని భావనలు ఒకే విధంగా ఉంటాయి.
- ప్రతి పాఠంలోని ముఖ్యమైన సూత్రాలను నిత్యం సాధన చేయాలి. వాటిని ఒకే దగ్గర రాసి పెట్టుకుని.. సమస్యలను సాధన చేస్తూ ఉండాలి.
- కీలకమైన పటాలను తరచూ ప్రాక్టీసు చేస్తూ.. వాటి భావనలను నిజ జీవితంలో అన్వయించుకుంటూ చేయాలి. దీనివల్ల వాటిని విద్యార్థులు మరిచిపోరు.
- పుస్తకంలోని టేబుల్స్‌ను శ్రద్ధగా పరిశీలించి వాటిపై ఇప్పటినుంచే పట్టు సాధించాలి. వీటి నుంచే సమాచార నైపుణ్యానికి సంబంధించిన ప్రశ్నలు రానున్నాయి.
- కాంతికి సంబంధించిన కిరణచిత్రాలు, ఆవర్తనం, నాభ్యాంతరం కనుగొనే ప్రయోగం, దృష్టి లోపాలకు సంబంధించిన వాటిపై ఎక్కువ దృష్టి పెట్టాలి.
- రసాయన శాస్త్రానికి సంబంధించి రోజువారీ జీవితంలో ఆమ్లాలు, లవణాలు, అనువర్తనాలను తెలుసుకునేలా సాధన చేయాలి. ఆధునిక ఆవర్తన పట్టికను పూర్తిగా అర్థం చేసుకోవాలి.


-జయపాల్‌రెడ్డి, స్కూల్ అసిస్టెంట్(ఫిజిక్స్), ప్రభుత్వ ధన్గర్‌వాడి ఉన్నత పాఠశాల, కరీంనగర్



జీవశాస్త్రాన్ని పూర్తిగా అర్థం చేసుకుంటేనే..

- జీవశాస్త్రంలోని పాఠ్యాంశాలను పూర్తిగా అర్థం చేసుకుంటే ప్రశ్నలకు సమాధానాలు సులభం. కీలక భావనలు, శాస్త్రీయ నామాలు, పటాల ప్రయోగాలను తరచూ సాధన చేస్తూ సొంత మాటల్లో రాసేలా సన్నద్ధం కావాలి.
- జీవశాస్త్రంలోని పోషణ, శ్వాసక్రియ, విసర్జక, నియంత్రణ వ్యవస్థ, ప్రత్యుత్పత్తి లాంటి పాఠ్యాంశాలు చదివేటప్పుడు.. ఆ ప్రక్రియ జీవులలో, మొక్కల్లో, మానవునిలో ఎలా ఉంటుందనే దానిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి. వాటిని సొంత మాటల్లో వివరించేలా సాధన చేయాలి.
- పర్యావరణం, సహజ వనరులు పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశముంది. పర్యావరణ సమస్యలపై, సహజ వనరుల పొదుపుపై స్వతహాగా అవగాహన ఏర్పరచుకోవాలి.


-ఆంజనేయులు, స్కూల్ అసిస్టెంట్(జీవ శాస్త్రం), జడ్పీ ఉన్నత పాఠశాల, జూబ్లీనగర్

స్టేషన్‌లో మొలకలొస్తున్నాయ్!

పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించింది. దాదాపు రెండు నెలల కిందట నాలుగో నెంబరు ప్లాట్‌ఫాంతో పాటు భవనం నిర్మించారు. ఇది సింగిల్ లైన్ ప్లాట్‌ఫాం కావడం, పొడవు తక్కువగా ఉండటంతో ప్రయాణికులు మూడో నెంబరు ప్లాట్‌ఫాంనే వినియోగిస్తున్నారు. వాడుకలో లేని నాలుగో నెంబరు ప్లాట్‌ఫాంలో సీసీ టైల్స్ మధ్య నుంచి గడ్డి, ఇతర మొక్కలు మొలిచాయి. భవనం వైపు నాటిన మొక్కల నిర్వహణ సరిగ్గా లేక ప్లాట్‌ఫాంపైకి వస్తున్నాయి.

-న్యూస్‌టుడే, పెద్దపల్లి




కేజీబీవీ విద్యార్థినులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కేజీబీవీలో శౌచాలయాలు ప్రారంభం

సుల్తానాబాద్: కస్తూర్బాగాంధీ పాఠశాలలోని పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులు వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. హైదరాబాద్‌కు చెందిన రఘువంశీ మెషిన్స్ టూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సామాజిక సేవలో భాగంగా సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ కేజీబీవీలో రూ.7 లక్షలతో 10 శౌచాలయాలు నిర్మించారు. శనివారం కలెక్టర్ వాటిని ప్రారంభించారు. సంస్థ సమకూర్చిన క్రీడా సామగ్రిని విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో భారాస రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పల్లెపాటి ప్రీతి, తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ డైరెక్టర్ అర్చన సురేశ్, ప్రాజెక్ట్ మేనేజర్ మేరీ, నిర్మాణ్ ఆర్గనైజేషన్ మేనేజర్ మహేశ్‌కుమార్, జెండర్ అండ్ ఈక్విటీ జిల్లా సమన్వయకర్త కవిత, పాఠశాల ప్రత్యేకాధికారిణి స్వప్న, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

వాగులా.. సాగేదెలా!




ధర్మారం మండలకేంద్రం నుంచి కొత్తపల్లికి వెళ్లే రహదారిపై శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ సమీపంలో పారుతున్న వరద ఇది. వానాకాలం మొదలైనప్పటి నుంచి ఇదే పరిస్థితి. ఎగువన చెరువు నిండి అలుగు పారుతుండగా పొలాల నుంచి వచ్చే నీటితో పాటు, మిషన్ భగీరథ లీకేజీ నీరు జత కలిసి వాగును తలపిస్తోంది. కొత్తపల్లి, బొమ్మారెడ్డిపల్లి గ్రామాలకు, ఆదర్శ పాఠశాలకు వెళ్లడానికి ఏకైక మార్గమిదే. నీటి ప్రవాహంతో వాహనదారులకు అసౌకర్యం కలుగుతోంది. రహదారిపై తారు దెబ్బతింటోంది. వరద నివారణకు రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి కిరణ్ తెలిపారు.

-న్యూస్‌టుడే, ధర్మారం

అప్పు పుడితేనే అవసరం తీరేది!

పంచాయతీలకు ఎనిమిది నెలలుగా నిలిచిన నిధులు


కమాన్‌పూర్ పంచాయతీ పరిధి కిష్టంపల్లి లోని మురుగు కాలువ ఇది. పిచ్చిమొక్కలు కమ్ముకుపోయి, పూడిక తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడదతో స్థానికంగా వ్యాధులు ప్రబలుతున్నాయి.

సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పంచాయతీ భవన నిర్మాణానికి సంబంధించి రూ.20 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా నిధుల మంజూరు కాలేదు. గుత్తేదారుకు రెండేళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు.



న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

పారిశుద్ధ్య లోపంతో పరిసరాల దుర్గంధం, వెలగని వీధి దీపాలు, పాడయిన చేతిపంపులు, మరమ్మతుకు నోచుకోని బోరు మోటార్లు పల్లెల్లో వెక్కిరిస్తున్నాయి. పాలకవర్గాలు లేకపోవడంతో ఎనిమిది నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల విడుదల నిలిచిపోయింది. ఖాళీ ఖజానాతో పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాక్టర్ల కిస్తీలు, తాగునీటి పథకాల నిర్వహణ, సిబ్బందికి వేతనాల చెల్లింపు భారంగా మారింది. ప్రతి చిన్న పనికీ అప్పు చేయాల్సి వస్తోంది. చిన్న పంచాయతీలకు కిస్తీలు చెల్లించుకోలేని పరిస్థితి నెలకొంది.

రూ.43.20 కోట్లు పెండింగ్

కేంద్ర ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎస్ఎఫ్‌సీ(రాష్ట్ర ఆర్థిక సంఘం) నిధులను జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు విడుదల చేస్తాయి. ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కావడంతో నిధుల విడుదల నిలిచిపోయింది. జిల్లాలోని 266 పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు ప్రతి నెలా రూ.5.40 కోట్ల చొప్పున ఎనిమిది నెలలకు రూ.43.20 కోట్లు రావాల్సి ఉంది. పంచాయతీ భవనాలు, సిమెంటు రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు దాదాపు రూ.156 కోట్లు, వేసవిలో తాగునీటి ఎద్దడి కోసం చేపట్టిన పనులకు రూ.1.83 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 1100 మంది పారిశుద్ధ్య కార్మికులకు వేతనాల చెల్లింపు నిలిచిపోయింది.

అప్పులు తెస్తేనే అవసరాలు

- తడి, పొడి చెత్త సేకరణ, మొక్కలను నీరందించేందుకు ట్రాక్టర్లకు ఇంధన ఖర్చు పంచాయతీలపై భారంగా మారింది.
- సర్పంచులు లేకపోవడంతో కార్యదర్శులు వ్యక్తిగతంగా అప్పులు తెచ్చి పంచాయతీ అవసరాలకు వెచ్చించాల్సి వస్తోంది.
- చేతిపంపులు, బోరుబావులు పాడయితే మరమ్మతు చేయలేని పరిస్థితి. చాలా వీధులు దీపాలు లేక అంధకారంలో మగ్గుతున్నాయి.
- అంతర్గత రహదారులు, మురుగు తొలగించడం లేదు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదు.

ప్రభుత్వానికి నివేదిస్తున్నాం

పంచాయతీల్లో నిధుల సమస్యపై ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. సిమెంటు రోడ్లు, భవనాల నిర్మాణానికి సంబంధించి ఉపాధి హామీ నిధులు మంజూరు కావాల్సి ఉంది. ఎక్కడా పారిశుద్ధ్య లోపం లేదు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.

-వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి


రహదారిపై గైడ్‌వాల్ నిర్మాణం పనులు

ఎట్టకేలకు రహదారి పనులకు మోక్షం

న్యూస్‌టుడే, మంథని: గోదావరి వరదలతో దెబ్బతిన్న మంథని-బోయినిపేట రహదారికి ఎట్టకేలకు మరమ్మతులు మొదలయ్యాయి. 2022 జులైలో భారీ వర్షాలకు వరదలు రాగా రోడ్డు కోతకు గురైంది. ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయి బోయినిపేట గ్రామస్థులు బొక్కలవాగు ఆనకట్ట మీదుగా మంథనికి వస్తున్నారు. 2023లో తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద రహదారి మరమ్మతుకు రూ.23 లక్షలు మంజూరయ్యాయి. గుత్తేదారు పని ప్రారంభించిన తర్వాత ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆగిపోయాయి. ఇటీవల పనులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనుమతినివ్వడంతో నాలుగు రోజులుగా పనులు జరుగుతున్నాయి. రహదారి కోతకు గురైన ప్రదేశంలో 126 మీటర్ల దూరం, నాలుగు అడుగుల ఎత్తుతో గైడ్‌వాల్ నిర్మిస్తున్నారు. అందులో మట్టి నింపనున్నారు. పనులు పూర్తయితే మంథని-బోయినిపేట మధ్య రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి.

విద్యార్థుల్లో వైకల్యం.. ఇదిగో సహాయం

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

విద్యార్థుల్లోని శారీరక, మానసిక వైకల్యాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ప్రశస్త' పేరిట ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించాయి. మొత్తం 20 విభాగాల్లో పలు అంశాలకు సంబంధించిన వివరాలను నమోదు చేయడం ద్వారా.. ఆయా విద్యార్థుల్లోని వైకల్యాలను గుర్తించే వీలుంటుంది. 0-18 సంవత్సరాలలోపు వారి వైకల్యాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే.. వారికి అవసరమైన చికిత్స, సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో 'ప్రశస్త'ను రూపొందించారు. ప్రస్తుతం పాఠశాల స్థాయిలో వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. అనంతరం అంగన్‌వాడీల స్థాయిలో నమోదు చేయించే అవకాశముంది. పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులు నమోదు చేసే వివరాలను.. ద్వితీయ స్థాయిలో 'భవిత' కేంద్రాలకు సంబంధించిన ప్రత్యేక విద్యా బోధకులు వారికి అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకుంటారు.

'ప్రశస్త'లో వివరాల నమోదు

నమోదు చేశాక..

'ప్రశస్త' యాప్ ద్వారా విద్యార్థుల వైకల్యాలను గుర్తించాక.. ఆయా పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తారు. ఆయా విద్యార్థుల వైకల్యాల వివరాలను వారితో చర్చించాల్సి ఉంటుంది. సంబంధిత వైకల్యం ఏ మేరకు ఉందనే విషయంలో వైద్య ధ్రువీకరణ పత్రం(సదరం) కోసం దరఖాస్తు చేయాలి. ఇందులో 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి చట్టపరంగా వివిధ రకాల సహాయం, రాయితీలు పొందేందుకు అర్హత పొందుతారు. పాఠశాల స్థాయిలోనే వారికి అవసరమైన ప్రత్యేక పరికరాలు, వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకుంటారు.

యుడైస్ కోడ్ ఆధారంగా..

జాతీయస్థాయిలో 'యుడైస్' కోడ్ కలిగిన ప్రతి పాఠశాలలోని పెన్(జాతీయ స్థాయిలో విద్యార్థి గుర్తింపు) నంబరు కలిగిన ప్రతి విద్యార్థి వివరాలను తప్పనిసరిగా 'ప్రశస్త' యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఉపాధ్యాయులు నమోదు చేసిన వివరాలను సరిచూసి ధ్రువీకరించాల్సి ఉంటుంది. వచ్చే నెలాఖరులోగా దేశవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లోని విద్యార్థులందరి వివరాలను 'ప్రశస్త' యాప్‌లో నమోదు చేయడం పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు మండలాల వారిగా పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేలా ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

विद्यया ऽमृतमश्नुते
एन सी ई आर टी
NCERT
ప్రశస్త యాప్

సులువుగా గుర్తించేందుకు..

తల్లిదండ్రులకంటే తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థుల వైకల్యాలను సులువుగా గుర్తించే అవకాశముంది. నల్లబల్లపై అక్షరాలు స్పష్టంగా కనిపించకపోవడం, మాట్లాడేటప్పుడు తడబడటం, వినికిడి సమస్యలాంటి వివిధ సమస్యలను ఉపాధ్యాయులు సులువుగా గుర్తిస్తారు. ఈ లక్షణాలను 'ప్రశస్త' యాప్‌లో నమోదు చేసినట్లయితే అలాంటి విద్యార్థులకు అవసరమైన చికిత్స, ప్రయోజనాలను ప్రభుత్వం సమకూర్చేందుకు వీలవుతుంది.


- బయ్యపు సుదర్శన్‌రెడ్డి, జిల్లా యాప్ రిసోర్సు పర్సన్

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: వివాదాల పరిష్కారం కోసం సమన్వయంతో వ్యవహరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్ సూచించారు. పెద్దపల్లిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడుతూ కక్షిదారుల మధ్య రాజీ కుదుర్చడానికి న్యాయవాదులు చొరవ తీసుకోవాలన్నారు. సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి స్వప్నరాణి, జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాది రాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి హేమంత్‌కుమార్

21,745 కేసుల పరిష్కారం

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 21,745 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా పోలీసు కేసులు 600, ఆర్థికపరమైన 6 కేసుల్లో రూ.18.40 లక్షలు, 12 మోటారు వెహికిల్ కేసుల్లో రూ.63.90 లక్షలు, 28 సైబర్ క్రైమ్ కేసుల్లో రూ.2.90 లక్షల జరిమానాలను బాధితులకు చెల్లించారు. వీటితో పాటు బ్యాంకు, టెలిఫోన్, ట్రాఫిక్ చలాన్లు, డ్రంకన్‌డ్రైవ్‌కు సంబంధించి 21,047 కేసుల్లో రూ.50,30,385 జరిమానాలను కోర్టులు విధించాయి.


పిల్లల ఆరోగ్య సంరక్షణకు కృషి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పిల్లలందరికీ అవసరమైన పోషకాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. పోషణ్ మహా-2024 కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దపల్లి నందన గార్డెన్స్‌లో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్ శ్రీహర్షను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో కలిసి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకిచ్చే పోషకాహారాల ప్రదర్శనను ఎమ్మెల్యే పరిశీలించారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కఠారి రేవతిరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ స్వరూప, జిల్లా సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు

అప్రమత్తతతో గుండె పదిలం

- ఉమ్మడి జిల్లాలో రోజుకు 200 శస్త్రచికిత్సలు
- నేడు ప్రపంచ హృదయ దినోత్సవం



న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

● పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ పొందుతున్న 36 ఏళ్ల యువకుడు అలసట, చెమటలు పట్టడం వల్ల నీరసంగా ఉండడంతో కరీంనగర్‌లోని వైద్య నిపుణులను సంప్రదించగా పరీక్షలు నిర్వహించి గుండె పోటుగా నిర్ధారించారు. అవసరమైన స్టంట్ వేయడంతో కోలుకున్నారు. ఆ యువకుడికి రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు లేకపోయినా గుండెపోటు రావడం ఆ కుటుంబాన్ని ఆందోళనకు గురి చేసింది.

● జగిత్యాలకు చెందిన 50 ఏళ్ల రైతు రోజూ వ్యవసాయ పనులు చేసుకుంటారు. ఆరోగ్యమైన జీవనం గడుపుతున్నారు. కరీంనగర్‌లోని తన కుమారుడి వద్దకు వచ్చినప్పుడు సాధారణ వైద్య పరీక్షలు చేయించగా గుండె సమస్య ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు.

పై రెండు ఉదాహరణలు చూస్తే ఒకరేమో యువకుడు నిత్యం శ్రమ చేస్తున్నవారు.. మరొకరు రోజూ పొలంలో చెమటోడ్చే రైతన్న.. ఇద్దరికీ దురలవాట్లు ఏమీ లేవు.. అయినా గుండె సంబంధిత సమస్యలు రావడం అందరూ ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియజేస్తోంది.. మారుతున్న జీవనశైలి ప్రభావమో.. ఇతర కారణాలో గాని గుండె సంబంధిత బాధితులు ఉమ్మడి జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్నారు.. సకాలంలో స్పందించి వైద్యం చేయించుకున్నవారు ప్రాణాపాయం నుంచి తప్పించుకుంటుండగా.. లక్షణాలు గుర్తించలేని వారు ప్రాణాలు కోల్పోతున్నారు..



మీకు తెలుసా?

- మధుమేహం, రక్తపోటు బాధితుల్లో 15 శాతం మందికి గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. రెండూ ఉంటే మరింత ఎక్కువ ప్రమాదం.
- అధిక బరువు ఉండటం.. శారీరక శ్రమ లేకపోవడం, ధూమపానం, మద్యం తాగడం, అధిక కొవ్వు పదార్థాలు, మసాలా వంటకాలు తినడం సమస్య తీవ్రతను పెంచుతాయి.
- ఒత్తిడికి ఎంత దూరంగా ఉంటే అంతమంచిది. సమతుల ఆహారం తీసుకోవడం, నిత్య వ్యాయామం చేసేవారు కూడా ఒత్తిడికి గురైతే గుండె సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

అసాంక్రమిక వ్యాధుల సర్వే (ఉమ్మడి జిల్లా) ప్రకారం..



- రక్తపోటు బాధితులు : 2,14,538 మంది
- మధుమేహం ఉన్నవారు : 1,13,218 మంది

లక్షణాలు



- తీవ్రమైన ఛాతి నొప్పి, వికారం, శరీరం అంతా చెమటలు పట్టడం ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడటం
- ఛాతిలో నొప్పి ప్రారంభమై ఎడమ చేతి, ఎడమ దవడ, కుడి చేతి వరకు లాగుతూ ఉంటాయి.
- నడిచేటప్పుడు ఛాతిలో నొప్పి వస్తూ అసౌకర్యంగా ఉంటే దానిని గుండెపోటుగా భావించాలి.
- గుండెలో సమస్య ఉంటే సాధారణం కంటే ఎక్కువగా కొట్టుకుంటుంది.

జాగ్రత్తలివి..



- ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలి.
- సమతుల ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, మొలకలు రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.
- వేపుళ్లు, జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్, శీతల పానీయాలు తీసుకోవద్దు.
- ప్రతి రోజూ మీ శారీరక సామర్థ్యం మేరకు వ్యాయామం తప్పనిసరి. కనీసం 45 నిమిషాలపాటు నడక అయినా జీవనంలో భాగం చేసుకోవాలి.
- ఒత్తిడికి గురికావొద్దు. పనిని ప్రణాళికతో చేయడం ద్వారా చాలా ఒత్తిడి తగ్గించుకోవచ్చు. ధ్యానం, యోగా ద్వారా ఒత్తిడి దూరమవుతుంది.
- గుండెపోటు వచ్చినట్లు అనిపిస్తే ఆందోళన చెందొద్దు. బరువులు ఎత్తవద్దు. మానసికంగా ప్రశాంతంగా ఉంటూ వెంటనే సమీప ఆస్పత్రికి వెళ్లాలి.
- ఎవరైనా గుండెపోటుతో అకస్మాత్తుగా పడిపోయి స్పృహ కోల్పోతే వెంటనే ఛాతిపై రెండు చేతులు పెట్టి గట్టిగా నొక్కుతూ (సీపీఆర్) చేయాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి.
- 30 ఏళ్లు దాటిన వారు ఏటా సాధారణ వైద్య పరీక్షలు చేయించుకుంటే ఆరోగ్య సమస్యలు గుర్తించొచ్చు. - డా.దినకర్, గుండె వైద్య నిపుణులు, కరీంనగర్



ఉమ్మడి జిల్లాలో (గుండె వైద్య నిపుణులు ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల వివరాల ప్రకారం) ఇలా..

- నెలకు వివిధ ఆస్పత్రుల్లో చేరుతున్న గుండె సంబంధిత సమస్య బాధితులు : 1500
- శస్త్రచికిత్సలు చేసుకుంటున్నవారు : 200
- గతేడాదితో పోలిస్తే పెరిగిన కేసులు : 10 నుంచి 15 శాతం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక విభాగం కరవు

ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్నా గుండె సంబంధిత వైద్య నిపుణులు, ఈ విభాగానికి సంబంధించి ప్రత్యేక సౌకర్యాలు లేకపోవడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులను, లేదంటే హైదరాబాద్ వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో గుండె సంబంధిత సమస్యల బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం బోధనాసుపత్రుల్లో గుండె వైద్య నిపుణులను నియమించాలని, ఆ విభాగాన్ని ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలని జనం కోరుకుంటున్నారు.

తప్పుల తడకగా రెండో జాబితా

డీఎస్సీ-2008 బాధిత అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

కరీంనగర్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి కరీంనగర్ జిల్లా 2008 డీఎస్సీ బాధిత అభ్యర్థులకు ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీ ఉద్యోగాల కల్పనకు జిల్లా విద్యాశాఖ చేపట్టిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం కొనసాగుతోంది. కరీంనగర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం పరిశీలన బృందం 67 మంది ధ్రువపత్రాలను పరిశీలించారు. వచ్చే నెల 4వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. విద్యాశాఖ ప్రకటించిన జాబితాపై అయోమయం కొనసాగుతూనే ఉంది. మొదట 61 మందితో ప్రకటించిన జాబితాలో ఉద్యోగాలు చేస్తున్న వారి పేర్లు ప్రకటించారు. ఈ తప్పు తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ శుక్రవారం 186 మంది బాధిత అభ్యర్థులతో రెండో జాబితాను ప్రకటించి వారి ధ్రువపత్రాల పరిశీలనను ప్రారంభించింది.



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ బృందం


తొలగని అయోమయం...

రెండో జాబితా కూడా తప్పుల తడకగా ఉందని, ఉద్యోగాలు సాధించిన వారి పేర్లతో పాటు మెరిట్ జాబితాలో లేని వారి పేర్లు కొన్ని వచ్చాయని అభ్యర్థులు పేర్కొంటున్నారు. 2010లో జిల్లా విద్యాశాఖ ప్రకటించిన మెరిట్ జాబితాలో ఉద్యోగాలకు అర్హత సాధించిన 15 మంది పేర్లు కూడా రెండో జాబితాలో లేవని సంబంధిత అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. 2008 డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగాన్ని సాధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడి పేరు కూడా జాబితాలో ఉండటం గమనార్హం. బీసీ-ఈ కేటగిరీలో కూడా ఇతర విభాగం అభ్యర్థి పేరు ప్రకటించారని బాధితులు తెలిపారు. తమ గోడును వెళ్లబోసుకునేందుకు జిల్లా విద్యా శాఖ, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆ 15 మంది బాధితులు వాపోయారు. రెండో జాబితాలో తన పేరు లేదని బిల్డింగ్ సూపర్‌వైజర్‌గా దశాబ్దకాలానికి పైగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న హుస్నాబాద్ మండలం గండిపెల్లికి చెందిన భుక్యా జెమ్ల పేర్కొన్నారు. డీఎస్సీ నిర్వహించి 16 ఏళ్లకు పైగా కావడంతో చాలామంది అప్పటి హాల్‌టికెట్లు, ర్యాంకు కార్డులు పోగొట్టుకుని వాటి కోసం ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. వాటి వివరాలు జిల్లా విద్యాశాఖ వద్ద ఉండటంతో పరిశీలనకు అనుమతించాలని సదరు అభ్యర్థులు కోరుతున్నారు. డీఎస్సీ అనంతరం అధికారులు ప్రకటించిన మెరిట్ జాబితాలో ఉన్న వారందరిని బాధిత అభ్యర్థుల జాబితాలో ప్రకటించి.. ధ్రువపత్రాల పరిశీలనను అధికారులు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ అధికారులను కోరారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు. సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.







రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

RAMOJI FILM CITY

మరిన్ని వివరాలకు.. www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

న్యూస్‌టుడే, ధర్మారం

? ధర్మారంలో మిషన్ భగీరథ గ్రిడ్ పైపులైన్ల లీకేజీలు ఎక్కువయ్యాయి. శుద్ధి చేసిన తాగునీరు వృథాగా పోతోంది. కొత్తపల్లికి వెళ్లే పైపులైను, ధర్మారం-కరీంనగర్ ప్రధాన రహదారి పక్కన రెండు చోట్ల లీకేజీలయ్యాయి. దీంతో బురద సమస్యతో పాటు గ్రామాలకు సరఫరా అస్తవ్యస్తంగా మారింది. **-మల్లేశం, కొత్తపల్లి, రాజు, ధర్మారం**

✔ లీకేజీలకు వెంటనే మరమ్మతు చేయిస్తాం. శుద్ధజలం వృథా కాకుండా చర్యలు తీసుకుంటాం. **-రోహిత్, డిప్యూటీ ఈఈ, మిషన్ భగీరథ**

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

? గోదావరిఖని లాల్‌బహదూర్ నగర్ కూడలి నుంచి జవహర్‌నగర్ కూడలికి వెళ్లే ప్రధాన రహదారిలోని ఓ పాఠశాల ముందున్న వీధి దీపం వెలగడం లేదు. వెంటనే చర్యలు తీసుకోండి.
- మనోహర్, జవహర్‌నగర్

✔ అవసరమైన మరమ్మతులు చేసి వీధి దీపాన్ని వెలిగించేలా చర్యలు తీసుకుంటాం. **- రాంజీ, నగరపాలక ఏఈ**



నెహ్రూ విగ్రహం వద్ద లీకవుతున్న తాగునీరు



ఇందిరానగర్‌లో రహదారిపై...

తాగునీటి వృథా

సుల్తానాబాద్‌లో పైపులైన్లకు నిత్యం ఏదో చోట లీకేజీలు ఏర్పడుతూ తాగునీరు వృథాగా పోతోంది. సుమారు ఇరవై ఏళ్ల కిందటి పైపులైన్ల ద్వారానే ఇప్పటికీ నీరు సరఫరా చేయడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. సామర్థ్యానికి మించి సరఫరా చేయడం, పైపులైన్లు ప్రధాన రహదారుల కింద ఉండడంతో వాహనాల రాకపోకల సమయంలో పైపులైన్లపై భారం పడి దెబ్బతింటున్నాయి. పాత వాటి స్థానంలో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలని పట్టణవాసులు కోరారు. పుర ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అమృత్ 2.0 పథకంతో రూ.18 కోట్ల నిధులతో పట్టణంలో త్వరలోనే 27 కి.మీ. మేర కొత్త పైపులైన్లు ఏర్పాటు చేస్తామన్నారు.

-న్యూస్‌టుడే, సుల్తానాబాద్

నవజాత శిశు యూనిట్‌కు అధునాతన పరికరాలు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ సహకారంతో నవజాత శిశు యూనిట్‌కు రూ.25 లక్షల విలువైన అధునాతన పరికరాలను కొనుగోలు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని సంస్థ డైరెక్టర్ అర్చన సురేశ్‌తో కలిసి పరిశీలించారు. సంస్థ డైరెక్టర్ ప్రీతి, ప్రాజెక్టు మేనేజర్ మేరీ, నల్ల ఫౌండేషన్ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి, డీసీహెచ్ శ్రీధర్, ఆర్‌ఎంవో రవీందర్ పాల్గొన్నారు.

డీఈఈ సెట్ ధ్రువపత్రాల పరిశీలనకు మరో అవకాశం

తిమ్మాపూర్, న్యూస్‌టుడే : డీఈఈ సెట్- 2024లో ఉత్తీర్ణత సాధించి ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కానివారికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ శ్రీరాం మొండయ్య తెలిపారు. అక్టోబర్ 1న డీఈఈసెటు-2024 హాల్ టికెటు, ర్యాంకు కార్డు, ధ్రువపత్రాలతో ఎల్‌ఎండీ కాలనీలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలన్నారు.

కనగర్తి శివారులో చిరుత సంచారం!

ఓదెల, న్యూస్‌టుడే: కనగర్తి-గుండ్లపల్లె గ్రామాల మధ్యన శనివారం మధ్యాహ్నం చిరుత రోడ్డును దాటుతుండగా చూసినట్లు స్థానికులు తెలిపారు. కనగర్తి విద్యుత్తు ఉపకేంద్రం దాటిన తర్వాత కనికాడిపల్లె వెళ్లే దారికి అవతల మానేరు వైపునకు చిరుత రోడ్డును దాటుతూ పంట పొలాల్లోకి వెళ్లడం స్పష్టంగా కనిపించిందని చెప్పారు. ఈ విషయమై తమకు ఎవరూ సమాచారం ఇవ్వలేదని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: భూ తగాదాకు సంబంధించి యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసిన ఘటన కాల్వశ్రీరాంపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం మండలకేంద్రానికి చెందిన చెప్యాల వినోద్ తమ స్థలంలో గోడ నిర్మిస్తుండగా అందులో తనకు వాటా ఉందంటూ అతడి పెద్దమ్మ మొండమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం తన తండ్రి స్వామితో కలిసి ఠాణాకు వెళ్లిన వినోద్‌తో గోడ కడితే కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్పారు. అనంతరం వినోద్ పొలం వద్ద పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు అతడిని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు.

అప్రమత్తంగా ఉండాలి

ముత్తారం: కరీంనగర్ దిగువ మానేరు గేట్లు ఎత్తిన నేపథ్యంలో మానేరు పరీవాహక ప్రాంత పారుపల్లి, ముత్తారం, అడవిశ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, జిల్లలపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేశ్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు.

నిరుద్యోగులకు అవకాశం ఇవ్వాలి

గోదావరిఖని: సింగరేణి ప్రభావిత గ్రామాలైన ముస్త్యాల, సుందిళ్ల, సింగిరెడ్డిపల్లి, జనగామ, చందనాపూర్ గ్రామాల నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ.. నిర్వాసిత యువకులు ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్‌కు వినతిపత్రం శనివారం అందజేశారు. ఓసీపీ-5 ప్రారంభ సమయంలో ప్రభావిత గ్రామాలకు అవకాశాలు కల్పిస్తామని మాట ఇచ్చారన్నారు.





సంఘంలో చేరిన వారితో జనక్ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ నాయకులు

కార్మికుల సంక్షేమానికి కృషి

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర కనీస వేతన చట్టం బోర్డు ఛైర్మన్ జనక్‌ప్రసాద్ అన్నారు. ఆర్జీ-3 ఏరియాలోని ఓసీపీ-2లో శనివారం పలువురు కార్మికులు ఐఎఫ్‌టీయూ నుంచి ఐఎన్‌టీయూసీలోకి చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో సంస్థ లాభాల వాటా నుంచి కాంట్రాక్టు కార్మికులకు రూ.5 వేల చొప్పున బోనస్ ఇప్పించామన్నారు. ఐఎన్‌టీయూసీ ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీ-3 ఏరియా ఉపాధ్యక్షుడు ఉడత శంకర్, జనరల్ సెక్రెటరీ బండ కిరణ్‌రెడ్డి, సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి, సెంట్రల్ క్యాంపెనింగ్ ఇన్‌ఛార్జి వికాస్ కుమార్‌యాదవ్, బ్రాంచ్ సెక్రెటరీ మల్లూరి మల్లారెడ్డి, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

విభాగాలను తనిఖీ చేసిన జీఎం

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఆర్జీ-1 జీఎం కార్యాలయంలోని వివిధ విభాగాలను జీఎం లలిత్‌కుమార్ శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని సిబ్బంది పనితీరు, దస్త్రాల నిర్వాహణను ఆయన పరిశీలించారు. పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఏజీఎం నాగేశ్వర్‌రావు, సర్వే అధికారి ప్రభాకర్, వర్క్‌షాపు డీజీఎం జితేందర్‌సింగ్, ఫైనాన్స్ డీజీఎం ధనలక్ష్మీబాయి, అధికారులు పాల్గొన్నారు.

లాభాల వివరాలు వెల్లడించాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: గతేడాది సింగరేణి సాధించిన లాభాల వివరాలను సవివరంగా వెల్లడించాలని సీఐటీయూ నాయకులు నర్సింహారావు డిమాండ్ చేశారు. జీడీకే-2 గనిపై శనివారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు రాజమౌళి, శ్రీనివాస్, నరహరి రావు, గౌస్, రామన్న, సమ్మయ్య, భీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-I క్రీడాకారిణికి బంగారు పతకం

గోదావరిఖని, న్యూస్‌టుడే: కోల్ ఇండియా పోటీల్లో ఆర్జీ-1 ప్రాంతానికి చెందిన క్రీడాకారిణి సత్తా చాటారు. ఒడిశాలోని సంబల్పూర్‌లో మహానది కోల్‌ఫీల్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్, వెయిట్, బాడీబిల్డింగ్ పోటీల్లో. . సాయిలత 84 కిలోల పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించారు. ఆర్జీ-1 సివిల్ విభాగంలో ఫిట్టర్ రాజయ్య.. 84 కిలోల వెయిట్‌లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించారు. జీఎం లలిత్‌కుమార్ వారిని అభినందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దపల్లి పురపాలికలో పారిశుద్ధ్య కార్మికులు, పర్యవేక్షకులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ మమతారెడ్డి సన్మానించారు. కమిషనర్ ఆకుల వెంకటేశ్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

మంథని, న్యూస్‌టుడే: మంథని మున్సిపాలిటీ పరిధిలోని శ్రీపాదకాలనీ, బీసీ కాలనీల్లో పట్టాలు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు శనివారం ఛైర్‌పర్సన్ రమాదేవికి, కమిషనర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ డివిజన్ కార్యదర్శి గణేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాపు, రవి, తిరుపతి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 360 కేసుల పరిష్కారం

గోదావరిఖని, న్యూస్‌టుడే: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం జిల్లా అదనపు కోర్టుతోపాటు మున్సిఫ్ కోర్టులో రాజీకి వచ్చిన కేసులను పరిష్కరించారు. పట్టణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం 938 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మంజుల పాల్గొని కేసులను పరిష్కరించారు. సహాయ పీపీ పర్వీన్, ఏసీపీ రమేశ్, సీఐలు ఎస్సైలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మంథని: మంథని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌తో 360 కేసులు పరిష్కరించి, కక్షిదారులకు రాజీ పత్రాలను అందజేశారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిగౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు, ఉపాధ్యక్షుడు రఘోత్తం రెడ్డి, సీఐ రాజు, ఎస్సైలు రమేశ్, చంద్రకుమార్, అనిల్, బ్యాంకు మేనేజర్ సుభాష్‌బాబు, న్యాయవాదులు శశిభూషణ్ కాచె, శ్రీహరి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్, అంజనేయులు పాల్గొన్నారు.



ఖని: లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా అదనపు జడ్జి శ్రీనివాసరావు



మంథని కోర్టులో మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిగౌడ్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ ఆధ్వర్యంలో 896 కేసులు పరిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, రమేశ్, ఏపీపీ శ్యాంప్రసాద్, ఏజీపీ లక్ష్మీరాజం, సీఐ సుబ్బారెడ్డి, న్యాయవాదులు, ఎస్సైలు పాల్గొన్నారు.

ధర్మారం: నందిమేడారం కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 358 కేసులు పరిష్కారమయ్యాయి. జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎన్.వెంకట సచిన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నార అశోక్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఆకారి రాజేశం, కార్యదర్శి నూనె సత్యనారాయణ, బీమారపు సంపత్, సీనియర్ న్యాయవాది గడ్డం లింగారెడ్డి, ఎస్సై శీలం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతుర్తిలో శ్రీ వేంకటేశ్వరుడి శాంతి హోమం

ధర్మారం, న్యూస్‌టుడే: తిరుమలలో శ్రీవెంకటేశ్వరుడి ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదం నేపథ్యంలో శనివారం దొంగతుర్తిలోని గోదా సమేత శ్రీలక్ష్మీ వెంకటేశ్వరుడి సన్నిధిలో శాంతి హోమం నిర్వహించారు. కొత్తూరుకు చెందిన కొలుముల దామోదర్ యాదవ్ ఫౌండేషన్ నిర్వాహకుడు దామోదర్‌యాదవ్ సౌజన్యంతో ఈ క్రతువు నిర్వహించారు. పభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీ హనుమాన్, ఏఎంసీ ఛైర్మన్ రూప్లానాయక్, మాజీ ఛైర్మన్ నర్సింహం, ఫౌండేషన్ ప్రతినిధులు నాగరాజు, ఆలయ కమిటీ ఛైర్మన్ అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ఆలయాల పవిత్రతను కాపాడాలి

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: ఆలయాల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా పురోహిత సంఘం అధ్యక్షుడు కొండపాక శ్రీనివాసాచారి పేర్కొన్నారు. తిరుమల లడ్డూను కల్తీ చేసిన వారిని శిక్షించాలంటూ శనివారం సుల్తానాబాద్‌లో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఒక్కరోజు దీక్ష చేపట్టారు. పురోహిత సంఘం సభ్యులు, ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.



ఒక్కరోజు దీక్షలో పాల్గొన్న హిందూ ఐక్యవేదిక సభ్యులు

ముగిసిన హాకథాన్ పోటీలు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: పన్నూరు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న హాకథాన్ పోటీలు శనివారం ముగిశాయి. కళాశాలకు చెందిన 84 మంది విద్యార్థులు 14 గ్రూపులుగా తమ ప్రాజెక్టు ఆలోచనలను జ్యూరీలకు వివరించారు. జాతీయ స్థాయిలో జరిగే స్మార్ట్ ఇండియా హాకథాన్ పోటీలకు సన్నద్ధం కావడానికి ఇది ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి అన్నారు.

ట్రెక్కింగ్ శిబిరానికి విద్యార్థుల ఎంపిక

మార్కండేయకాలనీ: గోదావరిఖని సెక్రెడ్‌హార్ట్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు ఎన్‌సీసీ కేడెట్లు ఆల్ ఇండియా ట్రెక్కింగ్ శిబిరానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఆరోగ్యమేరి తెలిపారు. ఇటీవల కరీంనగర్ ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో నిర్వహించిన ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక ప్రక్రియలో నిజామాబాద్ గ్రూప్ తరపున గోదావరిఖని ఎన్‌సీసీ కేడెట్లు కార్తీక్, రాజ్‌కుమార్, అచ్యుత, సాయిచరణ్‌లు ఎంపికయ్యారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: పెద్దపల్లి బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక, నాటక ప్రదర్శన పోటీల్లో విద్యార్థులు అలరించారు. ఆరోగ్యం-పరిశుభ్రత, ఉప అంశాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన శ్రీరాంపూర్ కేజీబీవీ బాలికలు ప్రథమ, జడ్పీ ఉన్నత పాఠశాల గర్రెపల్లి విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా జిల్లా సమన్వయకర్త పీఎం షేక్, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాశాఖ అధికారులు

మల్లన్న ఆలయ అభివృద్ధికి కృషి

ఓదెల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఓదెల శ్రీమల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని శాసనసభ్యుడు సీహెచ్.విజయరమణారావు పేర్కొన్నారు. వరంగల్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ బొల్లు బాలరాజు సహకారంతో రూ.లక్ష వ్యయంతో చేపట్టనున్న పోచమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి శనివారం ఆయన భూమిపూజ చేశారు. మల్లన్న ఆలయం మీదుగా పెగడపల్లి వరకు రూ.16 కోట్ల వ్యయంతో రెండు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆలయం చుట్టూ డబుల్ రోడ్డు నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఆలయ ధర్మకర్తల కమిటీ ఛైర్మన్ మల్లేశంయాదవ్, ప్యాక్స్ ఛైర్మన్ సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రేంసాగర్‌రెడ్డి, ప్యాక్స్ మాజీ ఛైర్మన్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచి మహేందర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఐలయ్యయాదవ్, ధర్మకర్తలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

మాదిగల జాగృతానికే 'మేలుకొలుపు'

పెద్దపల్లి, న్యూస్‌టుడే: వర్గీకరణపై మాదిగలను జాగృతం చేసేందుకే మేలు కొలుపు యాత్ర చేపట్టినట్లు మాదిగ ఐకాస వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి పేర్కొన్నారు. శనివారం యాత్ర పెద్దపల్లికి చేరుకున్న సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం మాదిగల రిజర్వేషన్లను 12 శాతానికి పెంచాలని కోరారు. జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్లు అమలు చేస్తే మాదిగలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఊట్ల వరప్రసాద్, బొంకూరి అవినాష్, లక్ష్మణ్, సంపత్, రాజేశ్, మహేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

■ భాజపా సభ్యత్వ నమోదు

పెద్దపల్లి కలెక్టరేట్: పెద్దపల్లిలో శనివారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా మాజీ అధ్యక్షుడు అర్జున్‌రావు ప్రారంభించారు. పార్టీ నాయకులు సదానందం, పర్శ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి(రామగుండం): 20వ డివిజన్ 234, 235 పోలింగ్ బూత్‌లలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శ్రీనివాస్, రాజేష్, రేణుక, సంపత్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

■ వేతనాల పెంపుపై 30న ధర్నా

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యంరావు పేర్కొన్నారు. ఎన్టీపీసీ ప్రాజెక్టు గేటు వద్ద శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 30న కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాకు కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

■ వేగంగా మీటర్ల బిగింపు పనులు

పాలకుర్తి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రూ.938లకే నూతన విద్యుత్తు మీటరు, కనెక్షన్ బిగింపు పనులకు.. ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని బసంత్‌నగర్ ట్రాన్స్‌కో ఏఈ వంశీకృష్ణ శనివారం అన్నారు. మీటరు లేనివారు ఆధార్, ఇంటి పన్నుల జిరాక్స్‌తోపాటు రూ.938లతో 500 వాట్స్ సామర్థ్యం కలిగిన మీటరును పొందవచ్చని పేర్కొన్నారు.

■ కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ సంఘాల ధర్నా

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అశాస్త్రీయంగా ఉన్న జీవో 25ను సవరించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటుకు ముందు ఎస్జీటీలను రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. లక్ష్మణ్, పరశురాములు, సంతోష్‌రెడ్డి, కనకయ్య, రాజనర్సు పాల్గొన్నారు.

పాలకుర్తి(రామగుండం): సర్దుబాటు ఉత్తర్వు జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ... ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యచరణ కమిటీ (జాక్టో) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టింది. రామగుండం, అంతర్గాం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

■ అధ్యాపకుల కార్యవర్గం ఎన్నిక

మార్కండేయకాలనీ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ల జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, ప్రిన్సిపల్ సయ్యద్ సలీం తెలిపారు. అధ్యక్షులుగా శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, సంయుక్త కార్యదర్శిగా నర్మద తదితర కార్యవర్గం ఎన్నికైంది.

■ ఎన్టీపీసీ అధికారికి సన్మానం

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ప్లాంటు స్టేజ్-1లో మెయింటెనెన్స్ విభాగంలో ఏజీఎంగా పనిచేసిన ప్రశాంత్ భావిష్కర్ బదిలీపై వెళ్తున్నందుకు శుక్రవారం ఎన్టీపీసీ ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్లు సన్మానించారు. బదిలీపై గుజరాత్‌లోని ఎన్టీపీసీ ప్రాజెక్టు మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు ప్రధాన కార్యాలయంలో విధులు చేపట్టనున్నారు.

■ పారిశుద్ధ్య పనుల పరిశీలన

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లిలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను డీఎల్‌పీవో వేణుగోపాల్ శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీవో సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

■ వ్యవసాయ క్షేత్రాల..

పాలకుర్తి(అంతర్గాం): మండలంలోని వ్యవసాయ క్షేత్రాలను జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి శనివారం పరిశీలించారు. వరిలో సుడిదోమ, బాక్టీరియా తెగులును గుర్తించినట్లు తెలిపారు. బాక్టీరియా ఎండు తెగులు నివారణకు యూరియా, అమ్మోనియా వంటి ఎరువులను వేయడం తాత్కాలికంగా ఆపివేయాలని, కాపర్ హైడ్రాక్సైడ్ 400 గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 60 గ్రాముల ఒక ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. ఏవో సతీష్, ఏఈవో రమేష్, తదితరులు పాల్గొన్నారు.

■ దసరా అడ్వాన్సు ఇప్పించండి

గోదావరిఖని పట్టణం: నగరపాలక ఒప్పంద కార్మికులకు దసరా అడ్వాన్సు రూ.10వేలు ఇప్పించాలని కోరుతూ శనివారం పారిశుద్ధ్య కార్మికుల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మేయర్ అనిల్‌కుమార్, అదనపు పాలనాధికారిణి అరుణశ్రీకి వినతిపత్రం సమర్పించారు. నాయకులు మురళీధర్‌రావు, యాకయ్య, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

■ నేడు మాల ఆత్మీయ సమ్మేళనం

గోదావరిఖని: మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఎన్టీపీసీలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు డానియల్ తెలిపారు. ఉపకులాల కులగణన చేయకుండా వర్గీకరణ జరపకూడదని, రిజర్వేషన్‌లను 35 శాతం పెంచాలనే అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

■ వ్యాయామంతో గుండె జబ్బులు దూరం

పెద్దపల్లి కలెక్టరేట్: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రోజు 45 నిమిషాల నడక, వ్యాయామంతో గుండె సంబంధ వ్యాధులు దూరమవుతాయన్నారు. వైద్యులు రాజమౌళి, సుధాకర్ రెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

■ భూలక్ష్మి విగ్రహం చోరీ.. పొదల్లో లభ్యం

కమాన్‌పూర్: జూలపల్లి మాజీ సర్పంచి శంకర్‌గౌడ్ ఇంటి ముందున్న బొడ్రాయి, భూలక్ష్మి విగ్రహం శుక్రవారం రాత్రి చోరీకి గురి కావడం స్థానికంగా కలకలం రేపింది. గ్రామస్థుల సమాచారంతో పోలీసులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. గుర్తుతెలియని వ్యక్తులు కొద్ది దూరంలోని చెట్ల పొదల్లో పడేసినట్లు గుర్తించారు. అక్కడి నుంచి పంబాల పూజారుల ఆధ్వర్యంలో తీసుకొచ్చి గతంలో ప్రతిష్ఠించిన చోటే పునఃప్రతిష్ఠించి పూజలు చేశారు.

■ బ్యాటరీ దొంగల పట్టివేత

పాలకుర్తి: బామ్లానాయక్ తండాలో ఎన్టీపీసీకి చెందిన ఓనేష్, సిరిగిరి రమేష్‌లు శనివారం సోలార్ బ్యాటరీలను దొంగతనం చేస్తుండగా స్థానికులు పట్టుకొని బసంత్‌నగర్ పోలీసులకు అప్పగించారు. మాజీ సర్పంచి రాజునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు.

■ పోడు భూముల్లో చదును చేస్తున్న ట్రాక్టర్ల సీజ్

మంథని గ్రామీణం: గోపాల్‌పూర్-ఓడాల మధ్య అటవీ ప్రాంతంలోని పాత పోడు భూముల పరిసరాల్లో అక్రమంగా చదును చేస్తుండగా అటవీ శాఖ అధికారులు రెండు ట్రాక్టర్లను గురువారం అర్ధరాత్రి పట్టుకున్నారు. మంథని, తోటగోపయ్యపల్లి గ్రామాలకు చెందిన ట్రాక్టరు యజమానులపై శుక్రవారం కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎఫ్‌ఆర్‌ఓ రమేష్ రాథోడ్ తెలిపారు.